సచివాలయాలపై శీతకన్ను

నాడు కళకళ..నేడు వెలవెల

- కూటమి పాలనలో నిర్లక్ష్యానికి గురవుతున్న సచివాలయాలు
- పనిచేయని కంప్యూటర్లు, ప్రింటర్లు
- నిలిచిపోయిన స్టేషనరీ సరఫరా
- దూరమవుతున్న సచివాలయ సేవలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



మచిలీపట్నంలోని 36వ డివిజన్ సచివాలయంలో మరమ్మతులకు గురైన కంప్యూటర్లు, ప్రింటర్

మచిలీపట్నంటౌన్: కూటమి పాలనలో వార్డు సచివాలయాల వ్యవస్థ రోజురోజుకు నిర్వీర్యమవుతోంది. ప్రజల ప్రతి అవసరాన్ని తీర్చేదిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ సచివాలయ వ్యవస్థను రూపొందించి ప్రజలకు సేవలందించగా, కూటమి ప్రభుత్వం అందుకు పూర్తిగా విరుద్ధంగా వ్యవహరిస్తూ ఈ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఏడాది కాలంగా సచివాలయాల ద్వారా ప్రజల సంక్షేమానికి సంబంధించిన ఏపనీ సాగలేదు. గత పాలకులు అమలు చేసిన సచివాలయ వ్యవస్థను కొనసాగించకుండా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందనేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే నిదర్శమనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా సచివాలయాల నిర్వహణ తీరే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది.

సచివాలయాల్లో అరకొర సేవలు..

నగర పరిధిలోని 50 సచివాలయాల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్లు పనిచేయడం లేదు. వీటి వాడకంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో మరమ్మతులకు సైతం నోచుకోవటం లేదు. సచివాలయాల్లోని కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయకపోవటంతో పలు సేవల కోసం వచ్చిన ప్రజలు వెనుతిరగాల్సివస్తోంది. విద్యుత్ బిల్లులు, ఆస్తి, నీటి పన్నులు, ఇతర సేవల కోసం వచ్చేవారికి సచివాలయ సిబ్బంది కంప్యూటర్లు, పనిచేయడం లేదని చెబుతుండటం నిత్యకృత్యమైంది. దీంతో ప్రస్తుత పరిస్థితిని గత ప్రభుత్వ సేవలతో బేరీజు వేస్తూ కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. కొన్ని డివిజన్లలో ఆయా కార్యదర్శులే తమ సొంత నిధులతో మరమ్మతులు చేయించి సేవలు అందిస్తున్న ఘటనలు లేకపోలేదు. సచివాలయాల్లో అందించాల్సిన సేవల కోసం తిరిగి ఈసేవా కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుండటంతో అదనంగా మరో రూ.100 వరకు భారంపడుతోందని ప్రజలు చెబుతున్నారు.



45వ డివిజన్ సచివాలయంలో పనిచేయని కంప్యూటర్

కార్యదర్శులే విద్యుత్ బిల్లుల చెల్లింపు..

నగరంలోని 36వ డివిజన్ సచివాలయం ఆంధ్ర జాతీయ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఈ గదిని మున్సిపాలిటీకి అప్పగించకపోవడంతో విద్యుత్ బిల్లును నగరపాలక సంస్థ చెల్లించడం లేదు. దీంతో ప్రతి నెల సచివాలయ ఉద్యోగులు లేదా డివిజన్ ఇన్‌చార్జ్‌లో ఒకరు వారి సొంత డబ్బులతో ఈ బిల్లు చెల్లిస్తున్నారు. తరచూ విద్యుత్ బిల్లు చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో నాలుగు నుంచి వారం రోజుల పాటు సచివాలయానికి విద్యుత్ సరఫరా నిలిచిపోతుండటం కూటమి పాలనలో సచివాలయాల దుస్థితికి నిదర్శనం.

స్టేషనరీ సరఫరాకు మంగళం..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి సచివాలయాలకు అవసరమైన స్టేషనరీని సరఫరా చేసే విధానానికి నగరపాలకసంస్థ అధికారులు మంగళం పాడారు. నగరపాలక సంస్థే సచివాలయాలకు ప్రతినెలా అవసరమైన స్టేషనరీని అందించేది. కూటమి పాలనలో స్టేషనరీ ఇవ్వడం లేదు. దీంతో గత ఐదేళ్లలో సచివాలయాల్లో అందిన సేవలు ప్రస్తుతం అటకెక్కాయని ప్రజలు చెబుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి సచివాలయాల ద్వారా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో అందించిన సేవలన్నీ యథావిధిగా కొనసాగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కలెక్టర్ స్పందించి పరిస్థితిని చక్కదిద్దాలి...



సచివాలయాల్లోని కంప్యూటర్లు పనిచేయకపోతుండటంతో పలుచోట్ల సిబ్బంది వారి సొంత కంప్యూటర్లతో సేవలు అందించాల్సి వస్తుండటం బాధాకరం. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అన్ని సచివాలయాల్లో తక్షణమే కంప్యూటర్లు, ప్రింటర్లకు మరమ్మతులు చేయించాలి. సచివాలయాలకు అవసరమైన స్టేషనరీని కూడా అందజేయాలి.

లంకిశెట్టి బాలాజీ, జనసేన నాయకుడు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

క్లుప్తంగా

బీట్ ద హీట్‌పై అవగాహన కల్పించాలి

ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ



చిలకలపూడి(మచిలీపట్నం): స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల మూడో శనివారం నాడు వేసవి వడగాలుల దృష్ట్యా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై అధికారులు 'బీట్ ద హీట్' పేరుతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో గీతాంజలిశర్మ మాట్లాడుతూ వేసవి వడగాలుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలను ప్రజలకు వివరించాలన్నారు. వడగాలుల కారణంగా ఒక్కరూ కూడా చనిపోరాదన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అందుకు సంబంధించిన కరపత్రాలను కూడా సిద్ధం చేసి మూడో శనివారం రోజు ప్రజలందరికీ పంపిణీ చేయాలన్నారు. పిల్లలు, వయోవృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతి పీహెచ్‌సీలో ఐదు పడకలను ప్రత్యేకించి వడగాలుల బాధితుల కోసం కేటాయించాలని అధికారులకు సూచించారు. అన్ని గ్రామాలు, పట్టణాల్లోని ముఖ్యమైన ప్రదేశాలలో చలివేంద్రాలను నిరంతరం నడపాలని ఆదేశించారు. సమావేశంలో డ్వామా, డీఆర్‌డీఏ పీడీలు శివప్రసాద్, హరిహరనాథ్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ శర్మిష్ఠ, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్ కుమార్, డీపీఓ అరుణ, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితర అధికారులు పాల్గొన్నారు.

మూగజీవిని కాపాడిన ఫైర్ సిబ్బంది



కోడూరు: ప్రమాదవశాత్తు బావిలో పడిపోయిన మూగజీవిని ఫైర్ సిబ్బంది బయటకు తీసి ప్రాణాలను కాపాడారు. వివరాల్లోకి వెళితే మండలంలోని లింగారెడ్డిపాలెం గ్రామానికి కంచర్లపల్లి స్వామి నివాస గృహం సమీపంలోని ఓ బావిలో సోమవారం మధ్యాహ్నం సమయంలో ప్రమాదవశాత్తు ఓ సూడిగేదె పడిపోయింది. గమనించిన స్థానికులు అవనిగడ్డ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు హుటాహుటినా ఘటనాస్థలానికి చేరుకొని గ్రామస్తుల సహకారంతో గేదెను బావిలో నుంచి బయటకు తీసి ప్రాణాలు రక్షించారు.

జాతర మహోత్సవం



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండలంలోని ఉత్తరచిరువోలులంక గ్రామంలో కృష్ణానది తీరాన కొలువైయున్న శ్రీగురవమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత ఉదయం అమ్మవార్లను సమీపంలోని కృష్ణానది వద్దకు తీసుకువెళ్లి పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మేళతాళాలు, డప్పుకళాకారుల సందడితో ఊరేగింపుగా ఆలయానికి తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పండ్లు, పూలతో నైవేద్యాలు సమర్పించారు. గుడిసంబరం నిర్వహించారు. జాతర సందర్భంగా తరలివచ్చిన బంధుమిత్రులతో గ్రామంలోని ప్రతి ఇల్లు సందడిగా మారింది.

గంగమ్మతల్లికి నూతన వస్త్రాలంకరణ



నాగాయలంక: వైశాఖ బుద్ధ పూర్ణిమ పర్వదినాన్ని పురస్కరించుకుని నాగాయలంకలోని మండవ వంశీయుల ఇలవేల్పు గంగమ్మతల్లి ఆలయంలో సోమవారం అమ్మవారికి నూతన వస్త్రాలంకరణ వేడుకను ఘనంగా నిర్వహించారు. తొలుత అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మండవ మధుసూదనరావు (పెదబుజ్జి), జానకీలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. అమ్మవారికి పొంగల్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు.

వైభవంగా నాంచారమ్మ జాతర



కోడూరు: భక్తుల ఇలవేల్పు మందపాకల అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి పూజలు చేశారు. తొలుత ముత్యాలమ్మ అమ్మవారి, అమ్మగారి తల్లి, అంకాలమ్మ అమ్మగార్ల జాతరను కనులపండువగా నిర్వహించారు. అనంతరం పోతురాజు స్వామివారి జాతరను కూడా భక్తిప్రపత్తులతో జరిపారు. యువకులు వీరతాళ్లు, ఖడ్గాలతో చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ ప్రభలను ఆలయం చుట్టూ తిప్పి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులపై శిరస్సు గండదీపాలపై పెట్టి ఆలయం చుట్టూ తిప్పుతూ అమ్మవారి మొక్కులు చెల్లించారు. జాతరను పురస్కరించుకొని ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

ఇద్దరికి గాయాలు

గూడూరు: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై రామరాజుపాలెం అడ్డరోడ్డు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. రామరాజుపాలెం గ్రామానికి చెందిన పరసా శ్రీనివాసరావు(చిన్నా మేస్త్రి), పేరుబోని వెంకన్నబాబులు సోమవారం మధ్యాహ్నం గూడూరు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వెళ్తున్న కారు వేగంగా ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ద్విచక్రవాహనం పల్టీలు కొట్టగా శ్రీనివాసరావు, వెంకన్నబాబులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను బందరు సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు గూడూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కనులపండువగా స్వామివార్ల కల్యాణోత్సవాలు



భవన్నారాయణస్వామి వారి కల్యాణం జరిపిస్తున్న భక్తులు



అవనిగడ్డలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక శ్రీదేవి భూదేవి శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావన్నారాయణ స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభోగంగా నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోశ్చరణలు, సంప్రదాయ మేళ తాళాలతో వంశ పారంపర్య ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది వెంకట శేషగిరిరావు, భోగాది లోకేశ్వరరావు సోదరులు సతీ సమేతంగా పీటలపై కూర్చోగా స్వామివారి వివాహ తంతును అలయ ప్రధాన అర్చకుడు పంచాగం రమణాచార్యులు, కందూరి శ్రీనివాసాచార్యులు బృందం జరిపించింది. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ఈఓ సిహెచ్ సుధాకరరావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్నదానం చేశారు. రథంగ హోమం, గ్రామ బలిహరణ, రథోత్సవ కార్యక్రామాలతో స్వామివారి కళ్యాణ మహోత్సవాలు ముగిశాయి.

ఖొజ్జిల్లిపేటలో...

మచిలీపట్నంటౌన్: నగరంలోని ఖొజ్జిల్లిపేటలో వేంచేసి ఉన్న శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీ నాగేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఆలయ అర్చకుడు రావూరు చైతన్యకుమార్‌శర్మ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో శ్రీ రమా సహిత సత్యన్నారాయణస్వామి వారి కల్యాణాన్ని దొండపాటి లక్ష్మీపతిరావు, ప్రమీలారాణి దంపతుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. కల్యాణోత్సవాన్ని ఈఓ వై శిరీష పర్యవేక్షించారు.

పాదాలవారిపాలెంలో...

కోడూరు: మండలంలోని మందపాకల శివారు పాదాలవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణోత్సవాన్ని సోమవారం కనులపండువగా నిర్వహించారు. పండితుడు కాశీభోట్ల శంకరశాస్త్రీ మంత్రవచనాల నడుమ కల్యాణతంతును శాస్త్రోక్తంగా నిర్వహించగా, పరిశె ప్రసాద్ దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. దేవాదాయ అధికారులు స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణమూర్తులను ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈఓ సుధాకర్, జేఏ దాసరి గిరిబాబు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవనిగడ్డలో....

అవనిగడ్డ: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దీవి పార్థవెంకట రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో పోతరాజు పవన్‌కుమార్, సావిత్రి దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. స్వామివారికి ప్రత్యేక అలంకారం చేయగా నిత్యహోమం, బలిహరణం, ఎదురకోల ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాలను ఈఓ యార్లగడ్డ శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యలను అధిగమించేందుకు కృషి

పెడన: తాగునీటి సమస్యను అధిగమించేందుకు కృషి చేస్తానని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి అన్నారు. పెడన మండలం కమలాపురం పంచాయతీ ఉప్పలక లువగుంట గ్రామంలో రూ.13లక్షలతో ఆధునికీకరించిన తాగునీటి రక్షణ పథకాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి సోమవారం ఆయన ప్రారంభించారు. తీరప్రాంతంలోనే కాకుండా తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, టీడీపీ మండల అధ్యక్షుడు శెలపాటి ప్రసాద్, సర్పంచి గుడిసేవ శ్రీనివాస్, జనసేన నాయకుడు పి.సురేష్ పాల్గొన్నారు.

గూడూరులో...

గూడూరు: బందరు పార్లమెంటు నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు ఎంపీ వల్లభనేని బాలశౌరి అన్నారు. గూడూరులో లజ్జబండ మురుగుకాల్వపై పీఎంజీఎస్‌వై నిధులు రూ.3.30 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను, ఆకులమన్నాడులో రూ.13లక్షల సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన మైక్రోఫిల్టర్‌లను పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలసి సోమవారం ఆయన ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని ప్రాంతాలకు సమప్రాధాన్యం ఇస్తూ, అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్నామన్నారు.



ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ, గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, గూడూరు డీసీ ఛైర్మన్ పోతన స్వామి, సర్పంచులు లింగం సులోచనా రాణి, మొహ్మద్ రఫి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం...

ఘంటసాల: ఘంటసాల అంబేద్కర్ నగర్‌లో మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ నిధులు రూ.26లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును సోమవారం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ సోమవారం ప్రారంభించారు. కూటమి నేతలు బండి రామకృష్ణ, తుమ్మల చౌదరి బాబు, గొర్రెపాటి రామకృష్ణ, భాను ప్రకాష్, పరాత్పరరావు, చలపతి, ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సత్యనారాయణ, ఏఈ సుగుణ కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని కొనసాగించాలి



చల్లపల్లి: జమిందారులకు వ్యతిరేకంగా ఎన్నో భూ ఉద్యమాల్లో పాల్గొని పేదల కోసం పోరాడిన మహా యోధుడు చల్లపల్లి నారాయణరావు అని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు కొనియాడారు. చల్లపల్లి నారాయణరావు 75వ వర్ధంతిని స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ అమర వీరుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి కమ్యూనిస్టు నేత పోరాడాలని సూచించారు. నారాయణరావు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాడ్ బెండింగ్ వర్కర్‌పై దాడి

కోనేరుసెంటర్: తాగిన మైకంలో ఓ యువకుడిపై మరికొంతమంది యువకులు దాడి చేశారు. పోలీసుల కథనం మేరకు మచిలీపట్నం బలరామునిపేటకు చెందిన తన్నేరు వీరభద్రరావు, కానూరు పెద్దిలు మద్యం మత్తులో ఘర్షణ పడటంతో ఇరుకుటుంబాలు రెండువర్గాలుగా ఒకరిపై ఒకరు దాడిచేసుకున్నారు. గాయాలపాలైన రెండు కుటుంబాలవారు చికిత్సనిమిత్తం మచిలీపట్నం సర్వజనాసుపత్రిలో చేరారు. ఈ ఘటనపై పోలీసులు ఆదివారం రాత్రి ఇరువర్గాలపై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వీరభద్రరావు అతని భార్యను మేనల్లుడు గుంజా పృథ్వీ పరామర్శించేందుకు ఆసుపత్రికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తుండగా సాయిబాబు గుడివద్ద కొమిరి శేఖర్, ఉప్పు మణికంఠ మరో ఇద్దరు కలిసి బీరుసీసాలు, కర్రలతో పృథ్వీపై దాడి చేసిన విచక్షణారహితంగా కొట్టారు. ఈ ఘటనలో పృథ్వీ తలకు బలమైన గాయాలయ్యాయి. పృథ్వీ కేకలు పెట్టటంతో దాడికి పాల్పడిన నలుగురు అక్కడి నుంచి పరారయ్యారు. చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరిన పృథ్వీ, జరిగిన సంఘటనపై మచిలీపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామూహిక పూజలు

చల్లపల్లి: నృసింహ జయంతి, వైశాఖ పౌర్ణమి సందర్భంగా స్థానిక నిమ్మలతోటలోని శ్రీహరిహర పుత్ర అయ్యప్పస్వామి క్షేత్రంలో సోమవారం ఉదయం సామూహిక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్యకులు భానూ నంబూద్రి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా పలువురు ఆలయ ప్రాంగణంలో హోమాలు చేసుకున్నారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



మచిలీపట్నంలో పరీక్ష రాసిన అనంతరం బయటికి వస్తున్న విద్యార్థులు

మచిలీపట్నంఅర్బన్: ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జిల్లాలోని 42పరీక్షా కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇంటర్లో విద్యార్థులు విఫలమైన సబ్జెక్టులకు మాత్రమే కాక ఉత్తీర్ణులైన సబ్జెక్టులో మార్కుల బెటర్మెంట్ కోసం ఇంటర్మీయట్ బోర్డు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తోంది. ఫస్టియర్ ఇంటర్ పరీక్షలకు 3,389 మంది హాజరుకావాల్సి ఉండగా 3,220 మంది హాజరయ్యారు. సెకండియర్ పరీక్షలకు 183 మంది హాజరు కావాల్సి ఉండగా 162 మంది హాజరయ్యారని ఆర్ఐఓ పి.బి.సల్మాన్ రాజు తెలిపారు.

చల్లిపల్లిలో 81మంది హాజరు

చల్లపల్లి: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సప్లిమెంటరీ పరీక్షలకు సోమవారం 81మంది విద్యార్థులు హాజరయ్యారు. చల్లపల్లిలో విజయ క్రాంతి జూనియర్ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్‌విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు మొత్తం 81మంది విద్యార్థులు హాజరైనట్లు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్లు బుర్రా శ్రీధర్, మోర్ల ఆదిశేషులు తెలిపారు.

దాడికి నిరసనగా సెక్యూరిటీ సిబ్బంది ఆందోళన



దాడికి నిరసనగా ధర్నా నిర్వహిస్తున్న ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది

మచిలీపట్నంఅర్బన్: మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో అంబులెన్స్ డ్రైవర్ బత్రాజు రాంబాబు సెక్యూరిటీ సూపర్‌వైజర్ ఎం.వెంకటేశ్వరరావుపై సోమవారం దాడిచేశారు. సెక్యూరిటీగార్డులు ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ తమ విధులను బహిష్కరించి ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. ఈసందర్భంగా సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడుతూ దాడికి పాల్పడిన డ్రైవర్ రాంబాబు గతంలో కూడా ఇతర సిబ్బందిపై దాడి చేశారని గుర్తుచేశారు. సంబంధిత అధికారులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆశాలతను కలిసి సిబ్బంది ఫిర్యాదు చేయగా, విచారించి చర్యలు తీసుకుంటామన్న ఆమె స్పష్టమైన హామీ ఇవ్వడంతో సెక్యూరిటీ సిబ్బంది ధర్నా విరమించి తిరిగి విధులలో చేరారు.

బుద్ధ జయంతి వేడుకలు



మచిలీపట్నంలో బుద్ధుడికి నివాళులర్పిస్తున్న నాయకులు

మచిలీపట్నంటౌన్: నగరంలో సోమవారం పలు సంస్థల ఆధ్వర్యంలో బుద్ధ భగవానుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళిత బహుజన పరిరక్షణ సంఘం నాయకులు యగ్గొని గాంధీ ఆధ్వర్యంలో స్థానిక రాజుపేట మగ్గాల కాలనీ వద్ద బుద్ధుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బుద్ధుని ఆశయాలు, బోధనలను వివరించారు. కార్యక్రమంలో ఖజానా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.శోభన్‌బాబు, సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కొడాలి శర్మ, సామాజిక ఉద్యమకారుడు మత్తే నాగరాజ్, సన్‌షైన్ సొసైటీ అధ్యక్షులు బేతపూడి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

పాగోలులో..

చల్లపల్లి: మండల పరిధిలోని పాగోలు ఎన్‌టిఆర్ స్కూల్ ఆవరణలోని బుద్ధ విహార్‌లో సోమవారం బుద్ధుని జయంతి ఘనంగా నిర్వహించారు. బౌద్ధ ఉపాసకులు చోడాబత్తిన ఆదినారాయణ బుద్ధునికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పలువురు పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు వెంకట్రామ్, శీలం అశ్విన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పాగోలులో బుద్ధ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎస్ఐ తదితరులు

ఆకట్టుకున్న నృత్య రూపకం



బుద్ధ నృత్యరూపకం ప్రదర్శిస్తున్న కళాకారులు

ఘంటసాల: ఘంటసాలలో నిర్వహించిన బుద్ధ జయంతి మహోత్సవంలో భాగంగా భాగవతుల వెంకట్రామశర్మ శిష్యబృందం సోమవారం రాత్రి ప్రదర్శించిన బుద్ధ నృత్య రూపకం ఆకట్టుకుంది. వివిధ వేషధారణల్లో కళాకారులు చేసిన నృత్యాలు, గీతాలు సభికులను ఆకట్టుకున్నాయి.

తృటిలో తప్పిన ప్రాణాపాయం

ఘంటసాల: ఘంటసాలలో జరుగుతున్న బుద్ధ జయంతి ఉత్సవాలకు విజయవాడ నుంచి వస్తున్న ఓ డాక్టర్ కారు అదుపుతప్పి పంటబోదెలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో కారులో నలుగురు ఉండగా ఎవరికి చిన్న గాయాలు కాకుండా బయట పడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సకాలంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో కారును బయటకు తీయించారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- టీడీపీ మండల అధ్యక్షుడు వర్సెస్ ఏఎంసీ ఛైర్మన్
- బయటపడిన విభేదాలు

అవనిగడ్డ: దివిసీమ టీడీపీలో నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. మాజీ సీఎం ఎన్టీ రామారావు విగ్రహ శంకుస్థాపన కార్యక్రమంలో నేతల మధ్య నెలకొన్న విభేదాలు బయటపడ్డాయి. దీంతో ఆదివారం జరగాల్సిన ఎన్‌టీఆర్ విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం నిలిచిపోయింది.

పోటాపోటీగా పార్టీ ఆఫీసుల నిర్వహణ..

టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు తొలినుంచి ఉప్పు నిప్పుగానే ఉంటున్నారు. యాసం చిట్టిబాబు స్థానిక వంతెన సెంటర్ వద్ద పెట్రోల్ బంకు ప్రక్కన టీడీపీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకోగా, టీడీపీ నేత బొబ్బా గోవర్ధన్ సహకారంతో కొల్లూరి వెంకటేశ్వరరావు రెండోవార్డులో మరో కార్యాలయాన్ని పెట్టారు. కొల్లూరి ఇటీవల దివి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన తర్వాత వీరి మధ్య విభేదాలు మరింత పెరిగాయి.

నిలిచిన ఎన్‌టీఆర్ విగ్రహ శంకుస్థాపన..

ఈనెల 7వ తేదీన కొత్తపేట ఎ కన్వెన్షన్ హాల్‌లో టీడీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఆ మరుసటి రోజునే 8వ తేదీన అవనిగడ్డ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో నిర్వహించిన మండలస్థాయి సమావేశంలో యాసం చిట్టిబాబు మాట్లాడుతూ అవనిగడ్డలో ఎన్‌టీఆర్ విగ్రహం లేదని, విగ్రహాన్ని తాను ఏర్పాటు చేయిస్తానని ప్రకటించారు. ఈక్రమంలో ఆదివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురు రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు టీడీపీ నాయకుడు బొబ్బా గోవర్ధన్, ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమానికి అరగంట ముందు మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబుకు కొల్లూరి ఫోన్‌చేసి శంకుస్థాపనకు రమ్మన్నట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన యాసం శంకుస్థాపన కార్యక్రమం వద్ద కొల్లూరి, బొబ్బాపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. తాను ఎన్‌టీఆర్ విగ్రహం ఏర్పాటు చేస్తానని చెబితే తనకు తెలియకుండా విగ్రహం ఏర్పాటు చేయడమేమిటని తీవ్రస్థాయిలో మండిపడటంతో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం నిలిచిపోయింది. వీరిలో ఒక వర్గానికి స్థానిక ఎమ్మెల్యే అండదండలు ఉన్నట్టు బహిరంగంగానే చెప్పుకుంటున్నారు. టీడీపీలో కొంతకాలంగా రెండు వర్గాల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న ఈ విభేదాలు విగ్రహ శంకుస్థాపన వ్యవహారంతో భగ్గుమనడంపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చకు దారితీశాయి.